# పిండీకృతశాటి

తూరుపున చుక్క పొడిచి బారెడెక్కింది. నిద్రలేచిన మనిషి ఆవులిస్తూ ఒళ్ళు విరుచుకొన్నట్లుగా వుంది ఊరు. ఊరజెరువు చుట్టుప్రక్కల ఇళ్ళముంగిళ్లలో కళ్లాపి చల్లుతున్న చప్పుళ్లు వినబడుతున్నాయి. దూరంగా, మసీదులోంచి నమాజు వినిపిస్తూవుంది. సత్రంలో వుండే పొగాకు బైరాగి గడ్డంలోంచి దొర్లి వెలుపలికి వచ్చిన అల్లాయిపదాలు సన్నగా ఊళ్లోకి ప్రాకుతున్నాయి. పల్లెలోంచి వూళ్లోకి డొంకనబడి వచ్చే జీతగాళ్లు పాడుతున్న కురుక్షేత్రంలోని పద్యాలు డొంకకు రెండుప్రక్కలా పెరిగిన చిల్లకంపముళ్ళ గుండెలు చీల్చుకుని సాగి ఊరూ పల్లెలమధ్య సంగీతం వంతెన కడుతున్నాయి.

ఊర జెరువు గట్టుమీద రావిచెట్టుకు అవతల ప్రొద్దుపొడిచే ప్రక్క పాడుబడ్డట్టుగా ఉన్న పూరింటిముందు వేపచెట్టు క్రింద చీకట్లో, చీకటి ఆకారం తెల్లటి బరువు ఎత్తుకొని, చెప్పులులేని కాళ్ళు ఇసుకలో గుచ్చుకుపోతుంటే, నెమ్మదిగా కాలుతీసి కాలువేస్తూ, పూటీగావున్న రెండెడ్లబండి ఇసుకలో మెత్తగా, ఎగిరిపడకుండా అణిచిపెట్టబడి ముందుకు పోయినట్లూ; పాతజ్ఞాపకాలు, అనుభవాలూ త్రవ్వుకొని వెలికివచ్చిన ప్రత్యంశం భద్రంగా పరిశీలించుకొని అవసరమయింది స్వీకరించి, అనవసరమయింది నెమ్మదిగా అవతలకునెట్టి సాగే రచయిత కలంలాగా; వెళుతూవున్న ఆకారం, ఊరజెరువు దాటి, దద్దనం మీంచి తిరిగి, పీర్లు ఇంటిముందుగా నడిచి, పెద్ద డొంకలో బళ్ళగాడి ప్రక్కగా అడుగులు వేసి, దేవళ్ళ చెరువుగట్టు మీదవున్న బావివైపు వెళ్ళింది.

ఆ ఆకారం ఒక మనిషి!!! ఆ మనిషి గూగడు. గూగడంటే గూగడు, ఆగడంటే ఆగడు అని పిల్లలు అతని చుట్టూచేరి గంతులేస్తూ

పాడుతూ వుంటారు. బడికి వెళ్ళేటప్పుడో, బడినుంచి వచ్చేటప్పుడో, ఎదురయితే. గూగడు ఎప్పుడూ ఆగలేదు. వీపుమీద బరువు వుంటే తాబేటినడక. చాలా నెమ్మది. ప్రతిఅడుగూ అతి భద్రంగా మరీ జాగ్రత్తగా వేస్తాడు. మూపుమీద బరువు లేకపోతే చిటుకు చిటుకు అక్కడక్కడే అతివేగంగా అడుగులువేసే చిన్న ఆకారం గూగడు ఎంత నడచినా ఎంతో దూరంపోలేడు. అయితే అందరూ అనుకొనేటట్లుగా గూగడు ఆగడంటే ఆగడు. ఎప్పుడూ ఏదో పని చేస్తూనే వుంటాడు.

కొందరు నోట్లో వెండి చెంచాతో పుడుతారని ఆంగ్లంలో నుడికారం ఉంటే ఉండవచ్చు, కానీ తెలుగులో వీపుమీద బరువుతో పుడతారనిమాత్రం లేదు. అయితే గూగడు నోచి పుట్టాడని ఎవరూ అనలేరు గానీ, వీపుమీద బరువుతో పుట్టాడని ఎవరయినా అంటారు. అలా పుట్టలేదని కొందరు చెబితే చెప్పవచ్చుగానీ, పుట్టీపుట్టః ముందే అతని భుజాలమీద బరువుపడింది. అతను వేసుకోలేదు. అదే పడింది. అలా పడింది మధ్యలో ఎప్పుడయినా తొలగిపోతుందా అంటే పోలేదు. చిన్నతనంలోని చిన్నబరువు అతనెంత పెద్దవాడయితే అంత పెద్దదయింది. బరువు శరీరంలోని భాగంగా పెరిగింది. కాదంటే అంతకంటే అధికమే అయింది.

చెరువు గట్టుమీద, ఊళ్ళమర్రిప్రక్క, నారింజతోట మొగదల మోట బావి చప్టాకివతల మూపుమీది బరువు దించుకొన్నాడు గూగడు. ఎండాకాలం చెరువు ఎండిపోయింది. ఎంత పైకిలాగితే అంత అధికంగా పెరిగే విద్య లాగా, ఎన్ని బొక్కెనలు చేదినా అంతకంత మిగిలి వుండే నీరున్న మోటబావి. నిండు కుండవంటి మనిషిలాగా నిశ్చలంగా ఉంది.

గిలకమీద బొక్కెన కట్టివున్న తాడుతీసి, చప్టాకు అవతల పెట్టి, తాడి చెట్టుదగ్గర అంతకు ముందురోజు పెట్టుకుపోయిన చేంతాడూ కడవలూ వెలుపలికి తెచ్చి, తాడు గిలకమీద వేసి, బావిలోకి పోనిచ్చి, ఉచ్చుముడి తడిపి, పైకిలాగి, కడవకు ఉచ్చువేసి, బావిలోకి వదిలాడు గూగడు. చేదిన కడవల నీళ్ళు బావి చప్టాకవతల అల్లంతదూరంలో ఉన్న రాతిబండ చుట్టూ కుండల్లో తొట్టిలో పోసి, వీపుమీంచి దించిన బరువు పీటముడి విప్పి, గుప్పెళ్ళు గుప్పె

ళ్ళగా తీసి బానలో అదిమిపట్టి ముంచాడు.

అవి బట్టలు. ఊరి బట్టలు. మాసిన బట్టలు. మాసిన ఊరిబట్టలు. నీళ్ళలో నానుతున్నాయి. అవి, రకరకాలవీ, రంగు రంగులవీ; పిన్నలవీ, పెద్దలవీ; స్త్రీలవీ, పురుషులవీ; కొత్తవీ, పాతవీ; అన్ని దశలలో మురికి అయినవీ, అన్ని రకాల మనుష్యులవీ; మంచివారివీ, చెడ్డవారివీ; సుఖం కలిగించిన వారివీ, దుఃఖం పంచిపెట్టిన వారివీ; అన్నం పెట్టినవాళ్ళవీ, అవస్థలు పెట్టిన వాళ్లవీ; ఆరోగ్యవంతులవీ, రోగిష్టి వారివీ; అందానికి కట్టుకొనేవీ, అవసరానికి కట్టుకొనేవీ; అన్నీ అన్ని విధాలయిన బట్టలూ నాను తున్నాయి.

మిగిలిన బానల్లో నీళ్ళు పోయడానికి కడవ చేస్తున్నాడు గూగడు. అప్పటికే ఆడా మగా చిన్నా చితకా ముసలీ ముతకా చాలామంది చేరారు. బావికి ఎనిమిది గిలకలూ విరామం లేకుండా మ్రోగుతున్నాయి. ఆ ధ్వని ఎండి పోయిన చెరువు మీదుగా పెద్ద డొంకలోంచిపోయి, దద్దనం మీద నాలుగు ప్రక్కలకూ చీలి సందుల్లో గొందుల్లోపడి, వాకిళ్ళలోంచి, కిటికీలలోంచి, చూరుల్లోంచి, మేడలు, మిద్దెలు, పెంకుటిళ్ళు, పూరిళ్ళలోకి పోయి, నేలమీద గచ్చుమీద, అరుగులమీద, నులకమంచాలలో, పట్టెమంచాలలో నిద్రపోయే అదృష్టవంతులు, దురదృష్టవంతులూ, స్త్రీలూ, పురుషులూ, పిల్లలూ పెద్దలూ అందరి చెవులలో పడి, ఆ రాత్రి నలగిపోయిన బట్టలు అవతల పెట్టి, ఉతికిన బట్టలు కట్టుకోవచ్చునని ఉత్సాహం ప్రసాదిస్తూ నిద్ర లేపుతున్నాయి.

మర్రిచెట్టు కల్లంతదూరంలో మూడురాళ్ళ పొయ్యిమీద ఉన్న బానలో నీళ్ళుపోసి, సోడామందు వేసి, కలదిప్పి, నానిన బట్టలు పడేసి, పొయ్యిరాజేసి మంట మండింతర్వాత బావిదగ్గరకు వచ్చాడు గూగడు. ముతకబట్టలు, సిలు బట్టలు, నేత బట్టలు ఉడుకుతున్నాయి.

పట్టుబట్టలు — రెండు—పైపంచె, కట్టు పంచె—రత్తయ్యవి, రత్తయ్య పెళ్ళినాటివి, అతి భద్రంగా పులిమాడు. ఉతకలేదు. నీళ్ళు పోయేట్టు ఒత్తాడు. పిండలేదు. నీళ్ళు తుంపర్లు లేచేటట్లు విదిలించాడు. జాడించలేదు. ఆ రెండు తడిబట్టలనూ పసిపిల్లల్ని చేతులమిద ఆడించటానికి వేసుకొన్న

ట్లుగా, చేతులమీద పెట్టుకొని, చిన్న చిటకేసర చెట్టుమీద ఆరవేశాడు. కొమ్మలకు, ముడతలు పడతాయి కొంగులు అని, కట్ట లేదు. ఆరవేశాడు. ఆకులుపైన ఆరవేశాడు. నేలమీద ఆరవేస్తే దుమ్ము అవుతుంది. పట్టు బట్టలు ఎండకూడదు. ఆరాలి. ఎండ రాకముందే ఆరిపోవాలి. ప్రొద్దుపొడవక ముందే ఆరిపోతే, వెంటనే తీసి భద్రం చేయవచ్చు. అందుకని మొట్టమొదటే పులిమాడు.

గూగడు పట్టుబట్టల పట్ల అటువంటి జాగ్రత్త తీసుకోవడం మామూలే! ఈ పట్టుబట్టలు విషయంలో జాగ్రత్తనంటిపెట్టుకొని భయం కూడా వుంది. రత్తయ్య అంటే గూగడికే కాదు, వూరుకే భయం. రత్తయ్య మామూలు మనిషి కాడు. అంతటి రైతు ఆ ఊళ్లో లేడు. ఆ చుట్టుప్రక్కలాలేడు. అతనంటే అందరికీ గౌరవం! అది ధర్మజం కాదు. ప్రేమజం కాదు. భయజం! రత్తయ్య అనుకొంటే చేయలేని పనిలేదు. అసాధ్యం లేదు. అసాధ్యుడు. అతనికి ప్రాణం ఇవ్వటమయినా తీసుకోవటమయినా మంచి నీళ్ళు తాగినంత తేలిక. నోరు దురుసు మనిషి. అంతేకాదు. చేయీ, కాలూ కూడా దురుసు! అతని మీసాలమీద నిమ్మకాయలేం కర్మ, దానిమ్మకాయలు నిలబెట్టవచ్చు. అయితే అతన్ని నిలబెట్టగల దమ్ములున్న మగాళ్ళు, ఆ ఊళ్ళోనేగాదు, ఆ ఫిర్కాలోనేలేరు. రత్తయ్య కళ్లు ఎప్పుడూ చింతనిప్పులు! అతను తాగుతాడంటారు లోకులు! నిజం చెప్పుకోవద్దూ, అతను చుట్ట తప్ప మరేం తాగటమూ ఎవరూ చూళ్ళేదు. ఏమాట కామాట చెప్పుకోవాలి, రత్తయ్య దయతలిస్తే, ఆ యిల్లు స్వర్గం. ఆ యింటిమీద పొరుగూరి కాకి వాలదు. కోపపడితే ఆ యిల్లు దగ్ధం. వల్లకాడు! ఏ ఊరికాకి అయినా ఎకా ఎకిని వచ్చి వాలుతుంది. అతనికి కోపం రాదు. వస్తే పోదు. అలాగే దయ. పులిని జూడు పులి మీసం జూడు అన్నట్లుగా వుంటుంది రత్తయ్య వాలకం.

రత్తయ్యకు ఏ విషయంలోనూ ఆది లేదు, అంతంలేదు. అంతా వర్తమానమే! గతాగతాల విషయంలో రత్తయ్య గుడ్డివాడు. పుట్టినప్పుడు నాలుగెకరాల గరువూ, రెండు నిట్రాళ్ళ యిల్లూ, అతని ఆస్తి. రత్తయ్య పుట్టిం తర్వాత మరొకరాతల్లి కడుపున పుట్టలేదు. అతను పెరుగుతున్నకొద్దీ ఆస్తీ

పెరిగింది. పిల్లికి బిచ్చం పెట్టడు. ఎంగిలిచేత్తో కాకినికూడా తోలడు. సంతోషం కలిగితే, కలిగించిన మనిషిని, ఎ(త్రయేగాణీ ఖర్చులేకుండా నెత్తికెత్తుకొంటాడు. కష్టం కలిగిస్తే కాలికింద చీమతో సమానం. సుఖంగా బతకదల్చుకొన్న వాళ్లెవళ్లూ రత్తయ్యకు కష్టం కలిగించరు. ఆ ఆలోచనే రానీయరు. వస్తే దాచిపెట్టుకొని అతనికి ఆనందం కలిగిస్తారు. రత్తయ్యవల్ల ఎంత కష్టం కలుగుతున్నా, ఆ ఊళ్ళో ఉండటం తప్పనిసరి అయినవాళ్ళు, నోరు మెదపరు. భయభక్తులతో, భక్తిశ్రద్ధలతో, శ్రద్ధాసక్తులకో, బుద్ధిమంతులయిన బడిపిల్లలు మాదిరిగా, పలకాబలపం వంటి పనిముట్లు పుచ్చుకొని, తమతమ పనుల్లో కూరుకుపోతారు.

ఒకసారి, మునసబు, మునసబునని గుర్తు తెచ్చుకొని, మునసబులాగా ఉండబోతే. నువ్వు మునసబువేకాదు, ఈ ఊరి మనిషివికూడా అని రత్తయ్య గుర్తు చేయటంతో మునసబు, మునసబు కమ్ మనిషి కమ్ రైతు అయి ఊరు కొన్నాడు. అందుచేత రత్తయ్య ఆ ఊరుకు మకుటంలేని మహారాజు, సైన్యం ఉన్న చక్రవర్తి. ఆ చక్రవర్తి సేవకుడు గూగడు. రత్తయ్యకు ఎంత ఆస్తి వుందీ ఎవరికీ ఎలా తెలియదో గూగడికి అలాగే తెలియదు. ఆస్తి వివరం అడిగితే రత్తయ్యే "ఉండక పోద్దా కొన్ని లచ్చెలు" అంటాడు.

లక్షాధికారి రత్తయ్య పట్టుబట్టలు చిటికేసర చెట్టుమీద వెల్లకిలా పడుకొని, ఆకాశంలోకి చూస్తున్నాయి. ఉడకేయడానికి వీలులేని బట్టలు సబ్బుపెట్టి పులిమి, ఒత్తి, ఉతికి, పిండి, భుజంమీదా, చేతులుమీదా వ్రేలాడ వేసుకొని, తీసుకుపోయి ఆరవేశాడు గూగడు. స్వయంగా బరువులేని బట్టలు నీటి సాహచర్యంతో బరువెక్కి, పిచ్చితులసి మొక్కలనూ. చిల్లకంప కొమ్మలనూ అణగద్రొక్కుతుంటే. పాపం, నోరూ వాయీ లేనివి కిమ్మనకుండా తలలు వంచుకొంటూ వున్నాయి.

ఉడికిన బట్టలు బండదగ్గరకు తెచ్చుకొన్నాడు గూగడు. ఒక బట్ట తీసుకొని, బండమీద సుయ్యోం-అహె-సయ్యోం అంటూ అటూ ఇటూ ఉతికి, మంచినీళ్ళ తొట్టిలో పాయలుతీసి, జలపరించి, మెలివేసి, పిండి, ఎదురుగా పరిచిఉన్న దుప్పటిమీద పడేశాడు. అలా పిండిన బట్టలు దుప్పటిమీద పడి

కంటబడగానే వంచిన నడుం ఎత్తి, కరెంట్ ఆగిపోతే, ఆడుతున్న కర్మాగారం కిరు కిరుమన్నట్లు; మిల్లులో ఇనుపతీగె తెగితే కటకట మన్నట్లు; ఒక్క మూలుగు మూలిగి, ఒక్కసారి నడుం విరుచుకొని, గుదులు బట్టిన కాళ్ళలోకి చేతుల్లో ఉన్న నెత్తురు పంపించి, ఆగినరైలు సాగినట్లు మొదట నెమ్మదిగా తర్వాత వేగంగా అడుగులు వేసి, బట్టలు దూరంగా ఆరవేసి వచ్చాడు గూగడు.

ఊరి వెలుపల, చెరువు గట్టున, ఊళ్ళమర్రి ప్రక్క, మోట బావి చప్టా చుట్టూ రాతిబండలమీద బట్ట ఉతుకుతున్న మనుష్యుల్ని, కర్మజీవుల్ని చూడటానికో, కర్మయోగం నేర్పటానికో, వాళ్ళు లయబద్ధంగా అరిచే సుయ్యోం-ఆహె-సయ్యోం వినటానికో, అక్కడ జరుగుతున్న కర్మకాండను కళ్లారా తిలకించటానికో కురుక్షేత్రం మధ్యలో ఉబికి వచ్చిన గీతలాగా కర్మసాక్షి ఉదయించాడు.

సూర్యుడు నిద్రలేచి ఆకాశంలో ఆవులిస్తూ కళ్ళు నులుంకొంటూ కరాలు మగతగా చాపుతూ చెరువు గట్టుమీదకి వచ్చేసరికి ఆరే బట్టలు, ఉతకబడే బట్టలు, నానే బట్టలు, ఉడికే బట్టలు, తడిసే మనుష్యులు, ఆరే మనుష్యులు, నానే మనుష్యులు, సబ్బుపెట్టేవాళ్ళు, ఆరేసేవాళ్ళు, నీళ్ళుతోడేవాళ్లు, ఆవులిస్తూ తిరిగేవాళ్ళు, పసివాళ్ళు, పెద్దవాళ్ళు, స్త్రీలూ పురుషులూ ఎవరి పని వాళ్ళు, ఎవరితోవన వాళ్లు, ఏం చేసే వాళ్ళదే చేస్తూ వింతగా పెద్ద సంతగా వుందా ప్రదేశం. సూర్యుణ్ణి చూచే ఓపికా, ఆలోచించే ఓర్పూ వాళ్ళకులేవు. బట్టలను, మనుష్యుల్ని, సూర్యుడు చూశాడు. తడి అయిన బావి చప్టా, నీరు ఓడుస్తున్న బండలు, రొచ్చురొచ్చుగా ఉన్న నేల, నీలిమందు సోడామందు నీళ్ళు నేలమీద పడితే విచిత్రమయిన వాసన వస్తుంటే పీలుస్తూ తిరిగే జనం-అంతా చూస్తున్నాడు సూర్యుడు.

పొయ్యి-పొయ్యి ప్రక్క పొయ్యి వరుసగా మండుతున్నాయి. నిన్న మొన్నటిదాకా, ఏ చెట్టునో పచ్చగా, పచ్చిబాలెంతరాళ్ళ మాదిరిగా కళ కళలాడిన కొమ్మలు, అంతకుముందే సూర్యుడి సంతానంతో స్నేహంచేసి, అనుకోకుండా మండి పోతున్నాయి. ప్రక్కనే పెరిగి పెద్దకావాలని, ఏనాటికయినా కాలిపోవటం కోసం పెరుగుతున్న పిచ్చితులసి మొక్కలు, చిల్లకంప

కొమ్మలు, మర్రిచెట్టు కొమ్మలు రెమ్మలు ఊడలు, చిటికేసర చెట్టుకొమ్మలు పెరుగుతూనే ఉన్నాయి. ఎండు కొమ్మలు కాలిపోతున్న పొయ్యి ప్రక్కనే మంటలదాపునే సెగ తగులుతూవున్నా, పచ్చిగా, పచ్చగా బ్రతుకుతున్న పిచ్చి తులసి మొక్కలు, ఎంత పిచ్చివయినా తులసి మొక్కలు సజీవంగా ఉండటం జీవకోటి ప్రాణదాత కర్మసాక్షి చూస్తూవున్నాడు.

తలక్రిందులుగా వ్రేలాడుతున్న నాగుబాముల వంటి మర్రివూడలు క్రింద ఇద్దరు పసిపిల్లలు మడతలు వేసిన రెండు దుప్పట్లమీద, సొంగకారుస్తూ నిద్రపోతున్నారు. వాలుతున్న ఈగలనూ, పడే దుమ్మునూ, తోలేవాళ్ళు, వూదేవాళ్ళు అక్కడలేరు. బావి దగ్గరున్నారు. బట్ట లుతుకుతున్నారు.

కళ్లలో పుసి, ముక్కువెంట చీమిడి, నూనెలేక రేగిన జుత్తు, మాసి పేలికలై చీలికలై వ్రేలాడే బట్టలు, ఉతుక్కోని శరీరం, గజ్జిపట్టి కురుపులయి చీమూ నీరూ కారుతున్న ఒళ్ళు, నడుస్తున్న రోగాలు, కనిపించే ఏడుపుల వాళ్ళు-ఆ పసివాళ్ళు, బావిచుట్టూ ఉన్న వాళ్ల సంతానం. వాళ్ల జీవితంలో ఆనందాలకు సంకేతాలు. ఊరికి పరిశుభ్రత ప్రసాదించే వాళ్ల బ్రతుకులు పొందిన ప్రతిఫలం. మురికివంటి ప్రతిఫలం. ఉతికిన బట్టలు విడిచిన మురికి ఏకీకృతమయిన రూపాలు. కర్మసాక్షి చూస్తున్నాడు. కళ్ళుండి చూడకేం చేస్తాడు సూర్యుడు. సామాన్యుడి అందని న్యాయం వంటి సూర్యుడు ఆకాశంలో బందీ!

రోహిణికార్తె మొదలై రెండురోజులైంది. రోళ్ళు పగలటం ఏం కర్మ, బండలూ, బండవంటి గుండెలూ పగిలే ఎండప్రతాపం చూపించబోతూవుంది. బారెడు ప్రొద్దెక్కింది. ఆ రోజు ఉదయమే పడమటి శాంబరం ప్రారంభ మయింది. ఆ చెవిలోంచి, ఈ చెవిలోకి దూసుకుపోతూవుంది గాలి.

గూగడు బట్టలన్నీ ఉతికి ఆరవేశాడు. నడుంమీద చేయి పెట్టుకొని వెనక్కు విరుచుకొన్నాడు. తనా దినం పడిన కష్టం వెలుతురుతో చెలిమి చేసు కొంటూవుంటే ఈషణ్మాత్రమయిన తృప్తితో బట్టలవైపు చూచి, నిర్వికారంగా నిట్టూర్చి మర్రిచెట్టు దగ్గరకు నడిచాడు. చెట్టు మొదట్లో, రెండు పైకి ఉవి

కిన వేళ్ళు పంగచీలిన చోట నడుం మోటించి కూర్చుని కాళ్ళు బారజాపు కొన్నాడు.

గూగడి కాళ్లూ చేతులూ కురచవి. ఒకప్పుడు ఎంతగట్టిగా వుండేవో చెప్పటం అసాధ్యం గానీ, అప్పుడు మాత్రం, దళసరిగా, బలంగా వున్నాయి. కొంచెంగా సడలి మడతలుపడ్డచర్మం ఒకనాటి రూపం స్ఫురింపజేస్తూవుంది. తన పని తానుచేసుకోవటానికి ఏ కష్టమూలేదు గూగడికి. అతను ఎత్తుపెరగ లేదు. అందుక్కారణం పూర్తిగా మూట బరువుకాకపోవచ్చు. శరీరతత్వం కావచ్చు. అయితే గూనిమాత్రం మూటబరువువలనే పెరిగిందని నమ్మే అవకాశం వుంది. గూగడు గూనితో పుట్టలేదు. అతను పెరుగుతున్నకొద్దీ గూని పెరిగింది. బట్టలమూట బరువుకు మనిషి, వీపూ మూపూ తలా వంగిపోవటం వల్ల పెరిగిందో, మూట నిలవటంకోసం ఎదురు మోటుకుంటూ పెరిగిందో కాని గూని మూరెడెత్తు పెరిగింది. ఎంత తలకు మించిన బరువు అయినా గూని మీద పెట్టుకొని, గూగడు వంగి, తూచి తూచి, ఒద్దికగా, క్రమంగా అడుగువేస్తూ ఎంతదూరం అయినా నడిచిపోగలడు.

గూగడు మూతిమీద మీసం చూచినవాళ్లు కారీతరంవాళ్ళు. మీసం గొరిగిన జాడ కనబడదు. పోనీ ఒకనాడు మీసంవున్న తీరూ గోచరించదు. అయితే అతనికి మీసం మొలవకపోలేదు. మొలిచింది. దాన్ని అరిచేతంత అద్దంలో చూచుకోకపోలేదు. చూచుకొన్నాడు. మీసం వచ్చిన మొదటిరోజుల్లో తేపతేపకూ తడుంకొని ఆనందించలేకపోలేదు. ఆనందించాడు. అయితే అప్పటికే తయారయింది గూని. పెరుగుతున్నంత కొద్దీ తలవంచుకొనిపోయింది. తలవంగినకొద్దీ మీసం తగ్గిపోయింది. తగ్గించుకొన్నాడు. తగ్గించుకొంటున్నా, గూని పెరుగుతున్నంతకాలం మీసం పెరిగింది. గూని పెరుగుదల ఆగిపోయింది. మీసమూ అంతే! ఎందువల్లనో కొంతకాలానికీ ఓష్ఠం పైభాగం ముక్కుక్రింద భాగం, అధరంలాగా, నున్నగా అయిపోయింది. అతన్ని ఉబ్బుపెదాల గూగడని కూడా ఆ రోజుల్లో పరాచికానికి పిలిచేవాళ్లు, జనం.

గూగడి వయస్సు చెప్పగలవాళ్లు ఆ ఊళ్లోలేరు. గూగడికంటేముందు

పుట్టినవాళ్లుకాదు. అతనితో పుట్టినవాళ్ళే లేరా ఊళ్ళో, అన్నా అనీ, తాత అనీ, మామ అనీ పిలిచేవాళ్లుకాక ఏరా అని పిలిచేవాళ్లు మాత్రమే వున్నారు. వీళ్ళంతా తాముపుట్టి భూమ్మీదపడ్డ దగ్గర్నుంచి, బుద్దెరిగిందగ్గర్నుంచి గూగడు ఇప్పుడెలా వున్నాడో అలాగే ఉన్నాడని చెప్పుకొంటుంటారు. రత్తయ్యా తన ఆస్తిని అంచనా వేయలేకపోయినా, గూగడి వయస్సు అంచనా వేశాడు, 'ఉండకపోద్దా డెబ్బయ్యో, యెనబయ్యో' నని.

గూగడు చిన్నతనంలోబోయీ. నలుగురుతోపాటు నారాయణా అంటూ పల్లకి మోసేవాడు. ఆ రోజుల్లో రైలుగానీ, బస్సుగానీ లేని కాలంలో ఆ వూర్నుంచి పెళ్ళికూతుర్ని ఇంకో వూరు తీసుకుపోవలసి వచ్చినా, తీసుక రావలసివచ్చినా, పెళ్లిమాట వినబడితే, పల్లకీమాట వినిపించేది. ఒహొం–ఒహొం-హొయ్; ఒహొం–ఒహొం-హొయ్ అంటూ పల్లకీకట్టి భుజాన పెట్టుకొని, పల్లకీతోపాటువచ్చే పెళ్లికూతురూ పెళ్లికొడుకూకంటే ముఖ్యంగా పల్లకీని బోయీలను, ముఖ్యంగా కురుచకాళ్ల, చిట్టి చిట్టి అడుగుల గూగణ్ణి చూడటానికి ఎదురుపోయిన పిల్లలు, క్రోసుదూరంలో అయినా పల్లకిని కలుసుకొని వూళ్లోదాకా వెంటవచ్చినవాళ్లతో పెద్దవాళ్లయిపెళ్లిళ్లయి, పిల్లలకుతల్లీదండ్రులయినవాళ్లు, గూగణ్ణి అంతకాలంతర్వాత చూచి, అప్పటికంటే ఎత్తు తగ్గిపోయాడని, ఎంత విడ్డూరమయినా చెప్పుకుంటూ వుంటారు.

బోయీగా పల్లకీ మోస్తున్న రోజుల్లో ఎవరయినా తనని కూడా పల్లకీలో మోసుకుపోతుంటే, కాలిమీద కాలువేసుకొని, నోట్లో చుట్టపెట్టుకొని రత్తయ్య భార్య ప్రక్క కూర్చున్నట్లు కూర్చోవాలని, ఠీవిగా అటూ, ఇటూచూడాలని ఎంత కోర్కెగా ఉండేది. లోకంలో ఎవరెవరికో ఏ ఏ కోర్కెలోవుంటాయి. అన్నీ తీరతాయనే నమ్మకం ఏమీలేదు. అంతే! గూగడికోర్కె తీరలేదు, తెలిసో తెలియకో ఉన్న ఈ ఒక్కకోర్కె తీరకపోతే అతనేమీ ఏడ్చిముఖం కడుక్కోలేదు. జన్మకొక శివరాత్రి అన్నట్లుగా ఎప్పుడయినా తీరకపోతుందా అని చాలాకాలం ఎదురు చూశాడు. ఎదురు చూడటంలో పుణ్యకాలం కాస్తా గంగలో కలిసింది.

గూగడు పుట్టినప్పుడు అందరూ అతణ్ణి ఆడిపోసుకొన్నారు, తండ్రిని

పొట్టన పెట్టుకు పుట్టాడని. పెద్దయినతర్వాత పొట్టలో తండ్రికోసం గాలిస్తే ఆకలి దొరికింది. అయితే గూగడు తల్లిని పొట్టన బెట్టుకోలేదు. చనిపోయిందాకా బ్రతికించుకొన్నాడు. తల్లికి కాలంతీరి చనిపోయిందిగానీ, కన్నకొడుకు కళ్లలో పెట్టిపెంచుకోకకాదు.

ఇరవై ఏళ్లయినా నిండని గూగడు, తల్లిని పోగొట్టుకొని ఒంటరివాడయ్యాడు. అప్పటికి రెండెకరాల కుంటనేల, ఒంటినిట్టాడి యిల్లు నిక్షేపంలా వున్నాయి. అప్పట్లో 'పెళ్లి చేసుకోవంటరా?' అని అడిగినవాళ్లులేకపోలేదు. గూగడు సిగ్గుపడకపోలేదు. అయితే పెళ్లి చేసినవాళ్లు మాత్రంలేరు. పోనీ నేనీ గూగణ్ణి కట్టుకొంటానని ఏ పిల్లా ముందుకురాలేదు. ఏ ఆడగూతురుకయినా తాళి కడతానని గూగడూ ముందుకురాలేదు. తన అన్నం తను వండుకొన్నాడు. తన బట్ట తను ఉతుకొన్నాడు. తన పక్క తనే వేసుకొన్నాడు. అందుచేత ఆడమనిషి అవసరం కనిపించలేదు. దేవుడిచ్చిన వరం, నిద్ర. హాయిగా, చీకూ, చింతా లేకుండా, పగలు ఒళ్ళు పడిన శ్రమఅంతా రాత్రి పడకలో మరచిపోయేవాడు. అప్పటికే మీసాలు మాయమయి, గూని స్థిరమయింది. తనకూ, రాతిబండకూ అయితే రేవులో కాకపోతే బావి చప్టాప్రక్క దాంపత్యం ఖాయమయిపోయింది. అప్పటికీ, ఇప్పటికీ మార్పులేదు.

గూగడికి బీడీ కుతిమళ్ళింది. బీడీ కాల్చటం ఆధునిక నాగరికత అతని మెడలువంచి నేర్పింది. అంతకుమించి అతని జోలికి రాలేకపోయింది. అలవాటుకొద్దీ బొడ్లో తడుంకొన్నాడు. బీడీ దొరకలేదు. రాత్రే అయిపోయాయి. సుబ్బారావుదగ్గర ఉండవచ్చు. 'సుబ్బిగా ఓరి సుబ్బిగా' అంటూ చూశాడు. చిటికేసర చెట్టుక్రింద తలగుడ్డ ఎత్తుపెట్టుకొని, పదేళ్ల కూతురుతో ఏవో కబుర్లు చెప్పుతూ పడుకొన్నాడు. అక్కడికిపోయి, పైన ఆరవేసిఉన్న పట్టుబట్టలు తడిమిచూచి, ఇంకా చెమ్మగావుంటే తర్వాత తీయవచ్చులే అనుకొంటూ 'సుబ్బిగా, సుబ్బిగా పిలిత్తే పలకవే?' అన్నాడు.

'యేంది మావా నన్నేనా యేంది బిలిసింది?'

'ఆ! నిన్నుగాకింకెవుణ్ణి బిలుత్తానా?! బీడీవుంటే యిత్తావనీ—వుందేంది—వుంటే యిటు బడెయ్ నాకోటి'

'ఆ! వుంది లేకేం యిదుగో దీసుకో. యేంది మావో దిక్కులు జూత్తండావు?'

'యేంది లేదురా! తేయిటు' గూగడు తీసుకొన్నాడు. బీడీ ముట్టించు కొని, కొన్ని క్షణాలు పొగలోపలే ఆపుకొని, ఆపైన ముక్కువెంట, నోటి వెంట వదిలిపెట్టాడు. గుప్పున పొగగొట్టాలలోంచి వచ్చినట్లు వచ్చిందిపొగ. మరుక్షణం ముఖమంతా కమ్ముకొంది. అప్పుడు చూస్తే ముఖంలోని ప్రతి వెంట్రుక పాదులోంచి పొగ వచ్చిందనిపించింది.

సుబ్బారావు అడిగాడు.

'యేందిమావ యెట్టోవుంది వాలకం? యేంది కతా? ఆఁ యేందంట?'

'యేందిరా యెట్టుందేంది.-సెప్పు! సెవులారాయింట.'

'యేందో యేదో యిదంగా యెట్టాగో; సరీంగాలేదు. నిద్దరలేనట్టూ ఆకలయినట్టూ, గుబులు పుట్టినట్టు యేందో....యెట్టాగో యెట్టాగోవుంది వరస!

'సరీంగా సెప్పరా పిచ్చిసన్నాసి—నచ్చికిట్టాడతావే! దిగులు గుండట్టూ, ఏడుత్తున్నట్టూ వుందంతేనా యింకెట్టాగానన్నా వుందా?'

'అంతే మావాఁ'

ఇద్దరూ మాట్లాడలేదు మళ్లీ. వాళ్ళిద్దరూ వదులుతున్న పొగ మాట్లాడు కొంటూవుంది. బీడీ ఇప్పటానికి లేచి సుబ్బారావు కూర్చునే వున్నాడు. గూగడు నిలబడే వున్నాడు. సుర సురలాడిస్తూ వస్తున్న సూర్యుణ్ణి చూస్తూ గూగడు అడిగాడు 'దీన్ని బళ్లోకెయ్యాలా?' పదేళ్ళ పాపనుద్దేశించి.

'ఆ యెందుకులే మాఁవా' రొండేళ్ళాగి ఓయ్యా చేతుల్లో బెడితేపోయె' సునాయాసంగా చెప్పేశాడు సుబ్బారావు.

అరవయి డెబ్బయ్యేళ్ళు ఊళ్లోకీ చెరువుగట్టుకీ తిరిగి సాధించింది ఏమిటని వెనక్కు తిరిగి ఆలోచించుకొంటే అనంతమయిన కాశీ కనిపించే

గూగడు ఏమీ అనలేకపోయాడు. ఆ పిల్లకు పెళ్ళవుతుంది. భర్తయింటికి కాపురానికి వెళతుంది ఒక మూట మోసుకువస్తుంది. ఉతుక్కోని తీసుకు పోతుంది. ఆంద్వతాలు లేకుండా వూరికీ చెరువుకూ మధ్య తిరుగుతున్న పదేళ్ల పాప పండుముసలి కావటం కళ్లముందు చిత్రం అయింది. మళ్లీ పాపవైపుచూడలేక పోయాడు.

'దాన్నెందుకురా యీడకి దీసుకొత్తా?'

'మీ యమ్మాయినేనా యేంది? యేం దీసుకొత్తే!'

'యేందన్నా అయితే ఆపైనేడిచి యేం లాభం సెప్పు!'

'యేంది మాఁవా దానికేం దవుద్ది దుక్కలాగుంటే!'

'శా! పనికిమాలోన్డా! అసలే నిండు మణిసి! దాంతోడు మూట బరువా? అదెట్టా బరిత్తదిరా! కాళ్లారినా కీల్లప్పినా కట్టఁవే గందా!'

'ఆఁ యేందిలే మాఁవా అట్టాటిది ఉత్త పుణ్ణేనికే యెందుకవుద్ది'

'ఒరె ఒరేయ్ అట్టా తుసకారించి పారెయ్యొద్దురా!'

'ఆఁ! యేందిలే మాఁవా కాలూ, సేయి ఉండప్పుడే నాలుగురాళ్లు పోగేసుకోకపోతే ఏదన్నా అయితే ఎవుడు జూత్తాడు? అది పాతికిళ్లు నేం బాతికిళ్లు చేసుకొంటే ఏదన్నా యెనకేసుకోపచ్చు, లేకపోతే ఏఁవుంది సిప్పే!'

ఇంక అక్కడ నిలవలేదు గూగడు.

'యేందోలేరా! యేందోలే! యేందోలే!' అంటూ మర్రిచెట్టువైపు నడక సాగించాడు. 'ముసిలోడు హూరకే యేందేందో గొణుగుతాడు' అనుకొన్నాడు సుబ్బారావు. నాలుగడుగులేసి, ఆగి, వెనక్కు దిరిగి 'సుబ్బిగా, ఓరి సుబ్బిగా మా సుతారంగా గాలుత్తున్నావ్ బీడీ, నుప్పురవ్వల్లేసేను. పైన బట్టలు పట్టు బట్టలుండాయ్ రత్తయ్యగోరి పట్టుబట్టలు ఆఁ!' అని మళ్లీ మర్రిచెట్టువైపు నడుస్తున్నాడు. 'అట్టాగే అట్టాగే' అన్న సుబ్బారావు మాటలు వినపళ్లేదు.

వినిపించుకోలేదు.

రవ్వపడి బట్టలకు చిల్లిపడితే ఏమయినా వుందా? కొంపలారిపోవూ? గూగడికి భయం కలిగింది. అంతలో బూసిమ్మ కళ్లలో మెదిలింది. కుర్ర తనంలో దొడ్డదే! ముసిల్దవుతున్నకొద్దీ పిసినారితనం పట్టుకొంది. మొదట్లో పట్టెడన్నం పెడితే పొట్ట బరాబరుగా నిండిపోయేది. కాలప్రభావం ఏమో అంతలోనే మారిపోయింది. నాలుగు మెతుకులు రాలపటానికి గింజు కొంటుంది. బట్టలు బాగా తీసుకుపోతేనే కొంప మునిగిపోయినట్లు గిలగిల తన్నుకులాడుతుంది. నిజంగా ఏమన్నా అయితే ఇంకేమన్నా వుందా? గూంట్లో సిలక ఎగిరిపోదూ!

ఒకరోజు బట్టలు చక్కగా మడచి, మడుపులు అందిచాడు. అన్నీ చూచుకొంది బూసిమ్మ. కొత్తబట్ట నలిగిపోయిందనీ, పాతబట్ట రాలేదనీ, చీరకు కొర్రుపట్టిందనీ, పంచెకు చిల్లిపడిందనీ, మగాళ్లబట్టల మురికిపోలేదనీ, తన బట్టలకు గరువు దుమ్ముకొట్టుకొందనీ, ఇట్లా చేసేదికాక, కల్లాలప్పుడు గింజలు గింజలంటూ గోనెసంచులేసుకొని ఎగబడటం తెలుసుననీ, పో పొమ్మని కసురుకొంది.

ఆరోజు అన్నం పెట్టటం ఆమెకు ఇష్టంలేదనీ, ఇష్టంలేని రోజు ముందు గానే, అనవసరంగా అలా తిడుతుందనీ, గూగడికి బాగా తెలుసు. కాచి వడపోసిన బ్రతుకు!

మధ్యాహ్నం రేవునుంచి యింటికి వచ్చాడు. మధ్యాహ్నం అంతా నిద్రపోయాడు. సాయంకాలం బువ్వబుట్ట ఒక చంకలో పెట్టుకొని, బట్టల మూట ఒక భుజంమీద వ్రేలాడవేసుకొని, బట్టలుఇచ్చి అన్నం పెట్టించుకొని పోవటం గూగడి అలవాటు.

'అద్సర్లేండి: బూసిమ్మగోరూ! ఆ మురికిబట్ట లిట్టాబడేయండి!'

'పొట్టు పొట్టు! ఎట్టో దగలడు. యియ్యాన్నా సుద్దంగా ఉతుక్కురా' అని ధర్మంచేసే వాళ్లధోరణిలో మురికిబట్టలు గూగడిముందు కుప్పవేసింది.

ఆ బట్టలు ఉతుక్కొని రాకపోతే గూగడికి నరకం వచ్చేసినట్లూ, దాన్నుంచి కాపాడటం కోసమే ఆమె బట్టలు వేస్తున్నట్లూ ప్రవర్తించింది బూసిమ్మ.

'బూసిమ్మగోరూ, బట్టల్సంగతి సరేగాన్లెండి కూంతి బువ్వబెట్టండి!' ఆమె ఆ పూట పెట్టదని తెలిసికూడా కడుపాత్రం పట్టలేక అడిగాడు గూగడు.

'యేం బువ్వరా! నీ తలమాడ! నీ మొకంమండ! నీ శ్రార్ధంబెట్ట! యేం బువ్వరా! నీ బువ్వ బుగ్గిగాను! యేళా పాళా లేకుండా యేడదెచ్చిపెట్టేదిరా నీకు! యేం ఒరగబెట్టావని బువ్వబెట్టాల్రా నీకు! ఫో ఫో కూళ్లేదు కుమ్మ లేదు.'

బూసిమ్మ అంటే ఆ వూళ్లో తెలియనివాళ్లు లేరు. ఆమె పుట్టినింటికీ, మెట్టినింటికీ ఏకైక వారసురాలు. ముగ్గురుకొడుకుల్లో పెద్దవాడికి అయిదేళ్లయినా లేనప్పుడు భర్తకు కాలంతీరింది. గాజూపూసా, బొట్టూ కాటుకా, తాళీ పూలూ చనిపోయిన భర్తకు సమర్పించింది కానీ, రాత్రిసమయాలలో అలంకరించుకొనేదనీ పూలూ బొట్టూ కాటుకా సింగారించుకొనేదనీ, చిన్న పిల్లలు పెళ్లీడుకెదిగిందాకా ఈ తతంగం సాగిందనీ, జీతగాళ్లు చెవులు కొరుక్కుంటూ వుంటారు. ఆమె దూరపు బంధువు, వరసకు మామ అయిన రత్తం ఇల్లు ఆమెయింటి ప్రక్కనేవుంది. అతని మీసం చూచి, జనంపైకి ఏమీ అనుకోలేదుగానీ పైవూళ్లకు పొక్కలేదని అందరూ అనుకొంటారు గానీ, చుట్టుప్రక్కల జనానికీ వూళ్లకు ఈ వ్యవహారం బాహాటంగానే తెలుసు.

ముగ్గురూ పెరిగి పెద్దవాళ్లు కావటంతో, ముసలితనం ముసురుకొని రావటంతో బూసిమ్మ మహాపతివ్రత అయిందని అనుకొంటుంటారు. అయినా ఇంగువకట్టిన గుడ్డ బూసిమ్మ! ఏ సంగతి ఎట్లావున్నా ఇరుగింటి, పొరుగింటి కాకి బూసిమ్మ ఇంటిమీద వాలకుండా కట్టుదిట్టం చేయించాడు రత్తయ్య. అదేం పోయేకాలమో బూసిమ్మ ముగ్గురు పిల్లలూ రత్తయ్యతో మాట్లాడరు. రత్తయ్యతో తగదాపడేవారు. బ్రతికివుండే అవకాశంలేదుగానీ, బూసిమ్మ ముఖం చూచి రత్తయ్య ఆ ముగ్గురుకూ పోయేకాలం రాకుండా దూరంగా వుంచాడు.

బుట్టలో అన్నంతో, భుజంమీద మురికిబట్టల మూటతో ఒక వీధినుంచి ఇంటికి వస్తాడు గూగడు. ఆ అన్నం ఆ పూట వండింది సాధారణంగా ఎవరూ వేయరు. ఉదయం మిగిలిపోయిందే వేస్తారు. ఒక్కొక్కప్పుడు అంతకుముందురోజు రాత్రి మిగిలిన అన్నం గూగడికి అట్టే పెడతారు. పాచి పట్టి నీరు ఓడుస్తూ జవజవలాడుతున్న అన్నమయినా, మాడినా అన్నమయినా, ఏదయినా, అన్నమే కాబట్టి, అన్నం పరబ్రహ్మ రూపం గనుక, తెచ్చుకొని, కొంతతిని, మిగిలినా, మిగలకపోయినా కొంత మిగుల్చుకొని, అటికలోవేసి, చెంబెడు నీళ్లూ, పిడికెడుప్పు దానిలోవేసి, మూతపెట్టి, ఉట్టిమీద పెట్టుకొని బట్టలమూట తలదగ్గరపెట్టుకొని, కుక్కినులక మంచంలో రాత్రికి నిద్రపుచ్చి, ప్రొద్దున్నే అటికలో ఉన్నబువ్వ పులిసి బుర్రట్టలాడుతున్నా, అందులో నీళ్ల-పుల్నీళ్ల 'చల్లా బొల్లాదాగి గల్లక్రింద బొడుకొంటే తెల్లారేసరికి కొల్లబోయి నన్నికల్లు' అన్నట్లుగా అటికెడు పుల్నీళు కడుపునిండా తాగి, పూరు అనే యింటికి మురికి కుప్పవంటి గూగడు, గూనిమీద మురికిబట్టలమూట పెట్టుకొని, నెత్తిన గంపెడు చీకటి వేసుకొని రేవుదగ్గరకుపోయి, బట్టలుతికి, మధ్యాహ్నానికి తీసుకువచ్చి, ఇంత అన్నం వండుకొనితిని, మళ్లీ సాయంకాలం మామూలే! గూగడికి ఆకలి ఎక్కువ! ముసలితనం పైబడేకొద్దీ ఆకలి మరింత ఎక్కువవుతూ వచ్చింది. అతను కడుపునిండాతిని ఎంతకాలమయిందో! ఆమధ్య అతని దినచర్య మారిపోయింది. మార్పమంటే అదేంతో పెద్ద మార్పేమికాదు. మధ్యాహ్నం అతను అన్నం వండుకోవటం లేదు. రాంసోమి పెళ్ళం వండిన అన్నం తన పిల్లల కింతపెట్టినట్లే ముసిలోడనీ, చిన్నప్పుడు తన నెత్తుకొని ఆడించాడన్న కృతజ్ఞతతో జాలితో గూగడికి మధ్యాహ్నం వడ్డిస్తూవుంది.

గూగడు పాతికిళ్ల బట్టలుతుకుతున్నాడు. అందులో అయిదుగురుకే మాగాణి పొలం వుంది. మిగతా వాళ్లందరికీ మెట్టపొలం! మునుపు ఒక్కొక్క రైతూ ధాన్యం పండినప్పుడు కల్లాల్లో అతను మోయ గలిగినన్ని వడ్లు ఇచ్చేవాళ్లు. ఏడాది పొడుగునా ఉబ్బిడి మబ్బిడి. బియ్యం కొదువ ఎరుగడు. కాలం మారింది. వాళ్లంత మెండుగా దండిగా గుండె నిండుగా ఇవ్వటంమాని వేశారు. ఇంటికి అవసరమయిన వస్తువులు ఉప్పుతో ఆరా,

పొగాకుతోసహా పంటలకాలంలో రైతులు దగ్గర్నుంచి తెచ్చుకొనేవాడు గూగడు. ఆ వ్యవస్థ రూపం మార్చుకొంది. క్రొత్త వ్యవస్థలో పాత అలవాట్లు పాత జీవితం గడిపిన గూగడు అలవాటు పడలేకపోయాడు. వూళ్లో అందరూ ప్రతి సంగతీ లెక్కలువేసి, జమా ఖర్చులు చూచి ఇవ్వటం-తీసుకోవటం కాదు-నేర్చుకొన్నారు. పిదప కాలం! ఒకప్పుడు రెండు పూటలూ ఇంట్లో అన్నం వండుకొనేవాడు గూగడు. కొంతకాలం తర్వాత ఒకపూట వండుకోవటం ఒకపూట అడిగి పెట్టించుకొని తెచ్చుకోవటం బాగానే వుంటూవచ్చింది. ఆపైన కాలమే గడ్డుకాలం. ఒకపూట వండుకోవటానికి ఏడాది పొడుగునా కల్లాల్లో తెచ్చుకొన్న ధాన్యం సరిపడకపోయింది. అడిగి తెచ్చుకొన్న దాన్యం సరిపడకపోయింది. అడిగి తెచ్చుకొన్న అన్నమూ చాలని స్థితి వచ్చింది. అప్పుడు రెండోపూట కూడా అన్నం వండుకోవలసిన స్థితీ వచ్చింది. బియ్యంలేని స్థితి. డబ్బు అవసరమయిన స్థితీ క్రమంగా గుర్తించాడు గూగడు. డబ్బుకోసం—ఉండనే ఉన్నాడు పెద్ద దిక్కు రత్తయ్య—రత్తయ్యను అడగటం తప్పనిసరి అయింది. గూగడు డబ్బు సంపాదించటం ఎరగడు. బట్టలుతికి డబ్బు అడిగే నాగరికత అతనికి అంటలేదు. అంటుకోదు. అంటుకోవటం అతనికి ఇష్టం కూడా లేదు. అన్నీ నాగరకంగా తెలుసుకొంటున్న వూరు అతని అవసరం గుర్తిస్తే బాగుండేది. ఎవడికోసం చేస్తాడులే అనే పరిస్థితి వూర్లోబాగా ప్రాకింది. అడగందే అమ్మ అయినా పెట్టేకాలం కాదిది. ఆ కాలం మనిషి గూగడు. ఈ కాలంలో బతకవలసి రావటం దుర్భరమే అయింది. కడుపునిండా తినటానికి డబ్బు తప్పనిసరి అయింది. ధనం సంపాదింపలేని గూగడు ఖర్చు పెట్టవలసి వచ్చింది. రెక్కలు ముక్కలు చేసుకొనే గూగడు డొక్కమాడిపోవలసిన వాడయ్యాడు. ఆ రోజుల్లోనే అతనిముఖంలోని నవ్వును కళ్ళలోని నిప్పు రవ్వలు, ఒంటిలో మంట కాల్చివేశాయి.

సుబ్బారావు ఇచ్చిన బీడీ పీల్పు పీల్పుకీ దుమామసిగా కాలిపోయింది. బీదరికం కాలి బీడి చివర్లో సుర సురలాడుతూవుంది. మర్రిచెట్టుప్రక్క ఆరవేసివున్న బట్టలు చుట్టూ తిరిగివచ్చాడు. మళ్ళీ మర్రిచెట్టు మొదట్లో గూని వెనుక తగిలేటట్లుగా కూర్చున్నాడు. మళ్ళీ బీడి కాలుద్దామంటే అందుకు గతిలేకపోవటంతో గూగడికి నాగలింగం గుర్తుకు వచ్చాడు.

నాగలింగం వేపచెట్టుకింద మంచం వేసుకొని బీడి కాలుస్తూ వుండ వచ్చు ననుకొన్నాడు గూగడు. గూగడు పెళ్ళీడు కెదిగినప్పుడు పుట్టాడు నాగలింగం. బళ్లోకెళ్ళి పలక పగులగొట్టి బలపం అరగదీసి, పుస్తకం చింపేసు కొని, అయ్యవారితో తిట్లూ, దెబ్బలూ తిని అయిదో తరగతి అనిపించు కొన్నాడు నాగలింగం.

బట్టల మూట తలకెత్తితే తల తిక్కకొద్దీ దాన్ని విసిరి నేలకేసి కొట్టి, ఇల్లు వదిలిపెట్టి ఎక్కడికో పారిపోయిన నాగలింగం డిప్టీతాసీల్‌దారు దగ్గర ప్యూనుగా చేరి జీపులో వూరు వచ్చిందాకా అతను బ్రతికి ఉన్నాడని ఎవరికీ తెలియదు.

మునసబు కరణం, డిప్టీతాసీల్‌దారు ధాంధూం లాడుతున్నాడనీ నువ్వు మనూరువాడివి కాబట్టి 'అది చెప్పు ఇది చెప్పు అయ్యగారితో' అని బ్రతిమాలు తుంటే చూచి 'ఆరి దీనియాలి అ ఆలలో యెంతుందిరా' అని గూగడు ఆశ్చర్యపడ్డాడు.

నాగలింగం పట్టణంలోపెళ్ళి చేసుకొన్నాడు. నలుగురు బిడ్డలతండ్రి అయ్యాడు. నలుగురికీ పెళ్ళిళ్ళు చేశాడు. కూతుళ్ళిద్దరూ కాపురాలకు పోయారు. అల్లుళ్ళకు ఉద్యోగాలున్నాయి. కొడుకు పెద్దవాడు లారీ డ్రైవరు, రెండోవాడు స్కూలులో ప్యూను. వాళ్ళకు నెలనెలా జీతం వస్తుంది.

నాగలింగం ఉద్యోగం వదిలి పెట్టినా కొంచెం తక్కువయితే మాత్రం ఏమిటి నెలనెలా జీతం వస్తుందని గూగడికి ఎక్కల్లేని ఆశ్చర్యం. నాగలింగం చేసింది ప్యూనుపని. పెద్దగా ఒళ్లెం విరుచుకోలేదు. తలేం బద్దలు కొట్టుకో లేదు. అయితే అతనికి ముసలితనంలో బాధ లేదు. బాధ్యత లేదు. హాయిగా నిశ్చింతగా భార్యతో సొంత యింటిలో కాలం గడుపుతున్నాడు.

గూగడు తనని గూర్చి ఆలోచించసాగాడు. ఒళ్ళంతా మగతగా వుంది. కళ్లు కూరుకుపోతున్నాయి. పైకి వచ్చిన మర్రివేరుమీద తలపెట్టుకొని నేల మీద పడుకొన్నాడు గూగడు. మత్తుగా నిద్ర ముంచుకువస్తూవుంది. అప్ప టికే బాగా ప్రొద్దెక్కింది. సూర్యుడి వేడి చెట్టుక్రింద తెలియటంలేదు.

పడమటి శాంబరం విదిలించికొడుతూవుంది. చల్లగా ఉండవలసిన చెట్లు క్రిందే ఒళ్లు ఇరఇరలాడుతూవుంది. అలిసిపోయిన ముసలిప్రాణం నిద్ర వాళ్లో ఒరిగిపోయింది.

ఒకరోజు-ఎండాకాలం-అర్ధరాత్రి. తూరుపు వీధిఅంతా అల్లకల్లోలం అయిపోయింది. పగలంతా ఒళ్లు హూనం అయి, రాత్రి ఆదమరచి నిద్ర పోతున్న గూగడు పూర్తి మెలకువా,పూర్తి నిద్రాకాని స్థితిలో మచంమీంచిలేచి ఇటూ, అటూ పరుగెత్తి ఎదురయిన ఎవరికో ఢీకొని ఈ లోకంలో పడ్డాడు.

ఇళ్ళు కాలుతున్నాయి. ఆడవాళ్లూ, పిల్లలూ ఆల గోల బాల గోలగా వుంది. మగవాళ్ళు కంగారుగా అరుస్తున్నారు. పరుగెత్తుతున్నారు. మంట లార్పటానికి వూరజెరువు ఎండిపోయింది. నీళ్ళులేవు. బావుల్లో నీళ్ళు ఎందరు తోడినా ఎన్ని నీళ్ళు పోసినా మంటలారటం లేదు. మంటల నాల్కలు అగ్ని దేవుడి శాపంలాగా ఆకాశంలోకి ప్రాకుతున్నాయి.

గూగడింటి ప్రక్కయిల్లు కాలుతూ వుంది. ఫెటిల్లుమని ధ్వనివచ్చింది. గాలి బాగా తోలింది. ఆ యింటిమీదనుంచి మండుతున్న తాటాకు లేచి వచ్చి గూగడింటిమీద పడింది. చూస్తూవుండగానే, ఆర్పేప్రయత్నం చేస్తూ వుండ గానే ఇల్లు అంటుకొని గుప్పున మంట లేచింది. గూగడి గుండెలు అవిసి పోయాయి. గబగబా లోపలికిపోయి, మురికి బట్టలమూట వెలుపలికి తెచ్చాడు. రెండోసారి ఇంట్లోకి పోవటానికి వీలులేకపోలేదు, పోవద్దని అందరూ అతన్ని వారించారు. మంచం, పెట్టె, వంటకుండ,పాతకుండ, గ్లాసు తపేళా, చెంబు, ముంతా మూకుడు, చట్టి, పిడత, ఉట్టి దణ్ణెం ఇంట్లోనే వుండి పోయాయి.

తెల్లవారిం తర్వాత, మిగిలిన మసి. మసిలో నిప్పురవ్వలు, ఇంకా కాలుతున్న దూలం, నల్ల కప్పేసిపోయిన గోడలు చూచి అవురుమని ఏడ్చాడు గూగడు. ఆ గోడలమీద మళ్ళీ ఇల్లు ఉందనిపించటానికి, బొంగులు తాటాకు కావలసి, రత్తయ్య దగ్గరే అప్పుచేసి, తనకూ ఇల్లు ఉందనిపించుకొన్నాడు.

కాలూ చేయీ కూడదీసుకొని ఇంట్లోకి కావలసిన నాలుగు పనిముట్లు

సంపాదించుకొనేసరికి ఏడేండ్లు పట్టింది. ఏ పండుగకో, ఏ రైతో దయతో ఇచ్చిన పాతబట్టలు గూగడి శరీరం పరువు పెలితిగా కాపాడుతూ వుంటాయి. రూపాయో రెండో ఎవరయినా ఎప్పుడయినా ఇస్తే బీడీలకు సరిపోతుంది.

కాడ పొగాకు మూడు చుట్టలు చుట్టుకొంటాడు. నాటు పొగాకు పూరి పొలంలో పండేరోజుల్లో రోజుకు నాలుగు కాడల చుట్టలయినా కాల్చేవాడు. రైతులంతా దొర పొగాకు పండించటం ప్రారంభించిన తర్వాత నాటు పొగాకు మోటయింది. దానిమాటే మరచిపోయారు. చుట్టలు కాల్చే రైతులు చాలా మంది సిగరెట్లు నేర్చుకొన్నారు. మారిన కాలంతో పాటు తానూ మారి, ఒక్క పొగాకు కాడతో రోజంతా నెట్టుకు వద్దామంటే దానిధరా ఆకాశం అంటిది. అంతకంటే బీడీల ఖర్చు తక్కువని, అణాకి ఆరు బీడీలు కనుక్కొని రోజంతా జరుపుకు వస్తున్నాడు గూగడు.

గూగడు బట్టలెప్పుడూ కొనుక్కోలేదు. రైతు లిచ్చినవే కట్టుకొనే వాడు. మునుపు చిరిగిన బట్ట, ఆపైన చిరగని బట్ట కట్టుకొని ఎరుగడు. అందరి బట్టలూ ఉతికి, మడతపెట్టి, మడుపులు అందించేవాడు. అయితే అతడి ఒంటిమీద బట్టలు ఒంటిమీదే తడిసిపోయేవి. మురికి అయ్యేవి. మురికొదిలి పోయేవి. ఆరిపోయేవి. ఆ తర్వాత చిరిగిపోయేవి. ఉతికితే, బండతగిలితే నిలిచే బట్టలు కావుకాబట్టి, గూగడాబట్టలు ఉతుక్కోవటం మానుకొన్నాడు.

రత్తయ్య గూగడికిచ్చిన డబ్బు కాలంతోపాటు ఖర్చయిపోయింది. కానీ కాగితం మీద లెక్కమాత్రం పిల్లల్నికంది. పిల్లలు పెరిగి తల్లిఅంత అయ్యేసరికి రత్తయ్య ఆలోచన నెరవేరే అవకాశం కనిపించింది. అసలుకు రెండురెట్లు అయిన వడ్డీలో సగం తీసేసిన ధర్మాత్ముడు రత్తయ్య. సగంవడ్డీ పూర్తి అసలూ తీర్చేమార్గం తీర్చేపద్ధతీ తీరికగా ఆలోచించే అవకాశం ఇచ్చి, వృద్ధుడయిన గూగడి పసి మెదడుకు ఎంతకీ ఆలోచన తట్టకపోతే మార్గం చూపించాడు రత్తయ్య. 'ఆఁ యేవుందీ, ఆ రొండెకరాలకుంటా ఇల్లూ, ఇంటిస్థలంవూ రాసిపారేస్తేపోద్ది.' ఆ సూచనవిన్న తర్వాత మూడురోజులు గూగడికి ఆకలి చచ్చిపోయింది. మాట పడిపోయింది. కాళ్లూ చేతులూ ఆడలేదు. ఆ తర్వాత కాలుగాలిన పిల్లి అయిపోయాడు, అమ్మోబాబో అని

లబోదిబోమన్నాడు. వినటానికి అమ్మా బాబూ లేరు. వుంటేగింటే వింటే గింటే ఏం చేయాలో తోచక స్వర్గంలో ఉన్నాసరే ఏడ్చివుంటారు!

'అంతా యిత్తే నే నేఁవయ్యేది?' అన్నాడు గూగడు గుండెబలం కూడదీసుకొని అయిదోరోజు.

'యాఁవవుతావ్ రా! యేంగావు!'

'యిల్లూ వాకిలీ, దొరా, నీకు రాసిపారేత్తే నే నేడుండేదీ అంట!'

'సచ్చిందాకా ఆ యింట్లోనే జావరా ముసిలోడా! సచ్చినాక ఆ యిల్లు నాకయ్యేటట్టు రాసుకుందాంలే యాఁవంటా!'

ఏమనటానికి మాత్రం ఏం అవకాశం వుంది? అందువల్ల గూగడు ఏమీ అనలేదు. రత్తయ్యతోపాటు రిజిష్ట్రారు ఆఫీసుకు పోయాడు. పొలం రాసిపారెయ్యటం అంతగా బాధకలిగించలేదు. ఇల్లూ, వాకిలీ లేకుండా చేసుకోవటమే ఇష్టంలేకపోయింది. సన్నరైతులకే పొలం పనులు కష్టం! అటువంటిది, తనకి పొలంతో సేద్యం ఇబ్బందిగానే వుంది. ఒక్కొక్కప్పుడు పెట్టినంత అయిపేజు కూడా రావటం లేదు. ఆ పొలం ప్రక్కనే రత్తయ్య పొలంవుంది. పొలంలో పొలం కలిసిపోతుంది. పది రూపాయలున్న వాడికి పైసంటే ఎంత గౌరవమో అంత ఆనందమే కలిగింది రత్తయ్యకు.

'యేరా పొలం పుట్రా, యిల్లూ, వాకిలీ అంతా రత్తయ్యకు రాసిపారేసేవంటగా!' అని ఎవరయినా రైతు అడిగితే 'నేనేం రాయలేద్దొరో. అట్టాటన్నేయం నా కంటగట్టమాకండి! అక్కడునోళ్ళంతా సదుంకున్న మారాజులు. ఆళ్లు కాగితాలమీద కలంపోటు పొడిసేరు, నే నేలంటిచ్చా. అంతే దొరా!' అనేవాడు గూగడు.

రత్తయ్య దయగల మనిషి. మాటమీదే నిలబడ్డాడు. గూగణ్ణి ఆ యింటిలో ఉండనిచ్చాడు. వెళ్లగొట్టలేదు. ఒకనాడు స్వతంత్రుడయినవాడు ఆ రోజునుంచి బానిస. రత్తయ్య దయాధర్మాలమీద ఆధారపడ్డాడు. వూరు అనే ఆఫీసుకు డస్టబిన్‌వంటి గూగడు ఆ రోజునుంచీ మొర్రిబోయిన డస్ట్

బిన్.

ఆయింటి కప్పుతో గాలిదేవుడు పరాచికాలు ఆడితే నిద్రలేచిన జులపాల తల మనిషి జుత్తులాగా, పిచికలు పీక్కుతిన్న మొక్కజొన్నకండెలాగా, కాల్చటానికి పారేసిన కలెక్టరాఫీసు కాగితాల కుప్పలాగా వుంటుందా యింటి కప్పు! ఆయింటి నడికొప్పుమీద చేరిన చెదలు సంతానాభివృద్ధి చేసుకొంటూ లక్షోప లక్షలుగా పెరిగి తాటాకురూపం కనిపించకుండా ఎర్రమట్టితో అలికేసినట్లు చేసినరోజుల్లో వానదేవుడు దయతలిస్తే మట్టిఅంతా కరిగిపోయి, వర్షం సరాసరి యింటిలో కురిసి, వాన వెలిసింతర్వాత, సూర్యచంద్రులకు తడిసిన కళ్లజోడులా వుంటుందా యింటికప్పు.

అటువంటి తరుణంలో దయామయుడయిన రత్తయ్య రెండెడ్ల బండితో మేకతాళాలతో వరిగడ్డి తోలి యింటిమీద కప్పించుకోమనిచెప్పి వూళ్లోవాళ్ల కళ్లలోకి సూటిగా చూచి, 'వాణ్ణి నేం గాకబోతే ఎవుడాదుకుంటాళ్లే!' అంటాడు.

గూగడిపొలం రత్తయ్యకు చెందకముందు అందులో పండించుకొన్న అల్లేరు సెనగకాయలు కొర్రుగట్టి, గుంటకదోలి, కుప్పయిన కాయలతో పాటు, గరువునేల గులకరాళ్లూ, రాయీ రప్పలను అల్లేరు సెనగకాయలు ఏరుకొన్నంత భద్రంగా ఏరి చేనుగట్టుచుట్టూ కట్టపోసుకొన్న గూగడు ఆ కాస్త పొలాన్నీ చిన్నపిల్లలను పెంచుకొన్నట్లు సాకాడు. ఆ పొలం రత్తయ్యకు హక్కు భుక్తాలతో చెందిం తర్వాత, ఒకసారి పోయిచూచి, తల్లి చనిపోతే ఏడ్చినంతగా ఏడ్చి తిరిగివచ్చాడు. మళ్లీ ఎప్పుడూ గరువుకు పోలేదు. పోతే చేనుచూస్తే, ఏడుపువస్తుంది. ఏడవటం ఇష్టలేదు. ఏడవటం మంచిదికాదు కూడా. 'ఏడిత్తే నీ ఉసురు మాగ్గొట్టుకుంటుం'దని రత్తయ్య కోప్పడతాడని భయం. గూగడు ఏడవటానికే స్వేచ్ఛలేని బానిస!

రాంసోమి భార్య పిచ్చిమ్మ లేకపోతే రెండేళ్లనుంచీ గూగడి పని ఇరకాటంలో పడేది. ఆమె నలుగురు కొడుకులూ చేతికెక్కి వచ్చారు. ఆ నలుగురుతోపాటూ తనకూ నాలుగు మెతుకులు పెడుతూవుంది.

పదేళ్ల క్రితం, ఆవూళ్లో పుట్టీ పెరిగిన రాంసో(వి తమ గానుగెద్దు బ్రతుకుల మీద విరక్తితో పట్టణం వెళ్లాడు. మెయిన్ రోడ్డుమీద చిన్నగది పెద్ద మొత్తానికి అద్దెకుతీసుకొని లాండ్రీ పెట్టాడు. జనం మురికిబట్టలువేసి ఇస్త్రీబట్టలు తీసుకుపోతారు. తాను ఇంటింటికి తిరిగే తంటా తప్పింది. డబ్బూదస్కం బాగా గిట్టుబాటు అవుతూ వచ్చింది. పిల్లల్ని దొరబాబులులాగా పెంచాడు. భార్య వంటినిండా నగలుచేయించాడు. అయిదేళ్ళు హాయిగా గడచింది. వూళ్లో ఎవరికీ కలవంచేవాడుకాడు. మునసబులాగా, రత్తయ్య లాగా పెద్ద రైతులులాగా తలెత్తుకు తిరిగాడు. రెండురోజులకు మూడురోజు లకు ఇంటికి వచ్చేవాడు.

ఒకసారి పట్టణంనుంచి వచ్చి వారంరోజులయినా మళ్లీ వెళ్లలేదు. తల వంచుకొని నడిచేవాడు. అందరికీ అనుమానం పట్టుకొంది. 'యేందో కతుంది!' అనుకొన్నారు. పోలీసులు ఇద్దరు వచ్చింతర్వాత, సంగతంతా తెలిసిపోయింది. పట్టణంలో వాళ్లబట్టలన్నీ ఎవరికో అమ్మేసుకొని ముఖం తప్పించి, ఆ వూళ్లో దలదాచుకొంటున్నాడని. దొంగలు పడ్డారనీ, బట్టలన్నీ పోయాయనీ, ఏం చెయ్యాలో తెలియక వచ్చేశాననీ, రాంసో(వి చెప్పిన మాటలు ఎవరి చెవికీ ఎక్కలేదు.

ఆ వూరు ఆడపడుచును అత్తవారింటికి బొట్టూకాటుకపెట్టి సారె చీరలతో అన్ని హంగులతో పంపినట్లు పోలీసులవెంట రాంసో(విని సాగ నంపారు, ఆ వూళ్ళో ధర్మం నాలుగు పాదాలమీద కలియుగంలోనూ నడిపించాలని తలంచే రత్తయ్య అండ్ పార్టీ!

వారం రోజులు తర్వాత రాంసో(వికి ఆర్నెల్లు జైలుశిక్ష వేశారని, వూళ్ళో అందరికీ తెలిసింది. ఆ కాలం గడచిపోయింది. రాంసో(వి రాలేదు, ఏమయ్యాడో తెలియలేదు. అయిదు సంవత్సరాలయినా అయిపులేదు. ఆ వూళ్ళోకిరావటం అవమానం అని మానివేశాడో, మరేమయిందో ఏమో! ఆర్నెల్లు ఏకధారగా కంటికీ మంటికీ ఏడ్చిన పిచ్చిమ్మ, ఆపైన కన్నీరు ఇంకిపోయిన పిచ్చిమ., కాలం గడిచేకొద్దీ ఆకాశంలోకి వెర్రిగా చూచిన

పిచ్చిమ్మ. చేతికెదిగివచ్చిన పిల్లలతో ఈ లోకంలో పడింది. బ్రతుకుతూ వుంది.

'రాంసోఁవి సచ్చిపోడు. సచ్చిపోయేంత పిరికోడు గాడు. అనవసరంగా అవమానం వొచ్చిందన్న బాత్తో ఈ వూర్రాలేకపోయాడు. ఈ వూరు సిన్నసూపు సూసింది. అందుకే వూళ్లో మొకం సూపలేకపోయేడు. యే పట్నఁవో యెల్లుంటాడు. బాగా సంపాయించే వుంటాడు పెళ్ళాం పిల్లల్ని గురించి ఇనేవుంటాడు. లాండ్రీ బాగానే సాగుతావుంటుంది. ఏ అపరేత్తిరేళో వొచ్చి మిమ్ముల్ని సూసేపోయుంటాడు. వాడబిఁమానం ఉన్నోడు. యెప్పుడో ఒక రోజొచ్చి మిమ్ముల్ని యెంటేసుకు తీసుకుపోతాడు' అని గూగడు పిచ్చిమ్మను అనేక విధలుగా వోదార్చాడు. అతని హృదయంలో లోలోపల పొరల్లో ఎక్కడో బ్రతుకు ఆశకు సంబంధించిన స్వార్థం దాగి వుండివుంటుంది. ఎప్పుడయినా పిచ్చిమ్మ ముఖాన ప్రొద్దుపొడిస్తే ఆ వెలుతురులో తన చరమకాలం హాయిగా గడపవచ్చుననే ఆశవుంది.

మర్రిచెట్టు వేరుమీద తలపెట్టుకొని నిద్రపోతున్న గూగడు ఎవరో తట్టి లేపినట్లు ఉలిక్కిపడిలేచాడు. చుట్టూ పరికించాడు. కునుకువల్ల ఒంటికి ఎక్కళ్ళేని బలం వచ్చింది. ఒళ్ళు విరుచుకొంటూ నిలబడ్డాడు. చుట్టూ అంతా హడావుడిగా వుంది. వాతావరణంలో పడేసరికి కొంచెం సమయం పట్టింది. పడమటి శాంబరం విదిలించి కొడుతూవుంది. బట్టలు లేచిపోతాయని, ఆరబెట్టిన బట్టలు మడతపెట్టకుండా పోగు బెడుతున్నారు. గూగడు గబగబా తన బట్టల దగ్గరకుపోయి, గాలివేగానికి అల్లల్లాడుతున్న బట్టలు పోగేశాడు.

ఎండ ఎక్కువయింది. నిప్పులు కురుస్తున్నట్లుగావుంది. ఒంగి బట్టలు తీస్తుంటే చొక్కాలోంచి చొరబడి వీపు కాలుస్తూవుంది. కాలుపెడితే నేల భగ్గున మండిపోతూవుంది. అసలే దువ్వనేల. నిప్పుకణికలు కాళ్ళకు అతుక్కొంటున్నట్లుగా వుంది. చెప్పుల్లేని కాళ్ళతో ఎత్తెత్తి అడుగులు వేస్తూ గూగడు నడుస్తుంటే పిల్లలు ఎగురుతున్నట్లుగా వుంది.

బట్టలన్నీ పోగువేసి, అమ్మయ్య అనుకొన్నట్లుగా నడుం పైకెత్తి

చిటికేసర చెట్టువైపు చూచేసరికి పై[ప్రాణాలు పైకేపోయాయి. రత్తయ్య పై పంచె! కట్టుపంచె! పట్టు బట్టలు!! ఎండతగలకుండా చేయాలనుకొంటే పాడునిద్రపట్టి, మండుటెండలో మాడిపోయాయి. మెత్తటి బట్టలు! పట్టు బట్టలు!! మునుపటి భయం స్థానంలో అప్పుడొక విధమయిన నిర్లక్ష్యం కలిగింది గూగడికి. చెరువుగట్టుమీద, ఎక్కడా ఆరవేసిన బట్టలులేవు. ఆ రెండూ తప్ప. గబగబా అటువైపు వెళ్లాడు గూగడు.

సమాధుల్లో పుట్టిన సన్నటి సుడిగాలి, ఒగుడాకులు, చెత్తా చెదారం, ఎర్రదుమ్ము, నల్లదుమ్ము కలుపుకొని, క్షణ క్షణం పెద్దదవుతూ, ఎర్రగా ఆకాశంలో కావురు గ్రమ్మేట్టు చేస్తూ, తాటిచెట్లుదాటి, చెరువుగట్టుమీదగా మళ్ళింది. సుడిగాలికి చిటికేసరచెట్టు అడ్డమయింది. దెయ్యం పట్టిన, గణం పెరిగిన, చలిపుట్టిన, భయం కలిగిన మనిషి వణికిపోయినట్లు చిటికేసరచెట్టు సంచలించింది. సుడిగాలి చెట్టుజుట్టు రేగగొట్టగా, పట్టు బట్టలు గూగడి ప్రాణాలు మాదిరిగా పైకిలేచాయి. సుడిగాలి గింగరాలు తిరుగుతూ పైకీ పైకీ పై పైకీ పోతూవుంది. సుడిగాలి నడిబొడ్డులో మెడలు చాచుకొని ఎగిరి పోతున్నాయి బట్టలు! పట్టుబట్టలు!! రత్తయ్య పట్టుబట్టలు!!!

అలా చూస్తూవుండగానే చేతికందకుండా ఆకాశంలోకి పోయిన బట్టలు గూగడి గుండెల్లో వేగంపెంచాయి. లబోదిబోమన్నా, బట్టలు వినలేవు కాబట్టి గూగడు మాటా పలుకుల్లేని మూగబొమ్మ అయిపోయాడు. ఆ బట్టలు ఎక్కడ పడతాయో, దొరుకుతాయో లేదో, దొరికితే ఎంత దుమ్ముకొట్టుకొని దొరుకుతాయో, ఏమో, ఏం జరుగుతుందో ఏమిటో ఆలోచించుకోలేక పోయాడు.

చెరువులో అలలు మాదిరిగా, గుండె దడ మాదిరిగా, కల్లోలినిలో తుఫాను తరంగాలు మాదిరిగా ఉంగరాలు చుట్టుకుపోయిన పట్టుబట్టలు విచ్చుకుపోయి ఆకాశంలో చెట్టా పట్టాలు పట్టుకొని, రాబందులు రెక్కలు వూపుకొంటూ ఎగిరిపోతున్నట్టు సాగిపోతున్నాయి.

ఇంతపెద్ద సుడిగాలి తను ఎరిగి వున్నంతలో ఎప్పుడూ రాలేదు. ఇంత ఎత్తుకు ఎప్పుడూ బట్టలు ఎగిరిపోలేదు. ఎప్పుడూ ఇటువంటి మంచి బట్టలు

గాలిలో లేచిపోలేదు. తలుచుకొంటుంటే ఒళ్ళు కంపరమెత్తిపోతూ వుంది. ఏం మూడుతుందో ఏమోనని వొంటినిండా చెమట పట్టి చితచితలాడుతూ వుంది. జలజలలాడుతూ వుంది.

బట్టలు గాలిలో తేలిపోతూ దక్షిణంగా తిరిగాయి. పైనవెల్లేబట్టలు చూస్తూ క్రింద గూగడు వెళుతున్నాడు. కొంతదూరం నిరామయంగా నడిచాడు. ఇక పరుగెత్తుతున్నాడు.

'లగెత్తు! లగెత్తు మాఁవా యెందూరం పోతాయ్యో యేందో, లగెత్తు లగెత్తు!' సుబ్బారావు వెనుకనుంచి చెబుతూనేవున్నాడు. వూరు అనే యింటికి మురికి బట్టల మూటవంటి గూగడు పరుగెత్తుతున్నాడు. గూగడి బట్టలన్నీ మూటగట్టి తన మూట దగ్గర పెట్టుకొని, భార్యనూ, పిల్లల్నీ ఇంటికిపంపించి, గూగడివైపుచూస్తూ నిలబడ్డాడు సుబ్బారావు.

ఎండలకు రేగడినేలపగిలి నెర్రెలు పడింది. మట్టిగడ్డలు ఎండి కొన దేలిన ఇనుప తుంటెలులాగా గట్టిపడ్డాయి. మట్టి గడ్డలు గుచ్చుకొంటుంటే ప్రాణం గిలగిలలాడుతూవుంది. రేగడిమట్టి పగుళ్ళ కోపులు పదునైన బాకుల లాగా పైకి తేలాయి. గడ్డ కాలి కిందపడ్డా, కోపుమీద కాలుజారినా, నెర్రెలో కాలు దూరినా, కాలూ, కాలుతోపాటు మనిషి, మనిషితోపాటు ప్రాణం అల్లడ తల్లడ అయిపోతుంటే, పైకి మాత్రమే చూస్తూ, ఎటు బట్టలు వెళుతుంటే అటే వెళుతున్నాడు గూగడు.

ఎండ వేడికీ, శరీరం తొందరకూ, మనస్సు వేగానికీ తట్టుకోలేని ముసలి ప్రాణం గూగడు. ఒళ్ళంతా చెమటపట్టి కసకసలాడుతూ వుంది. రొప్పుగా ఎగశ్వాసగా ఉంది. కాళ్ళు తేలిపోతున్నాయి. రేగడిమట్టి నెర్రెలో పడి కుడికాలి బొటనవ్రేలు విరిచినట్లు అయిపోయింది. ఎండిన మట్టిపెడ్డలు కోపులు అరికాలులో గీసుకుపోయాయి. సర్వేరాయి ఎదురుదెబ్బ తగిలి బొళ్ళ బీటుగా ముందుకుపడితే, ఎదురొమ్ములో ఎండిన మట్టిపెళ్ళ పొడుచుకొంది. ఎడంకాలి వ్రేళ్ళు అన్నీ, ముఖ్యంగా బొటనవ్రేలూ, చితికిపోయాయి. గూగడు లేచి నిలబడ్డాడు. పైకి చూశాడు. పైకి చూస్తూ పరుగెత్తుతున్నాడు.

రెండు తుమ్మ ముళ్లు ఒకేసారి అరికాలులో దిగబడ్డాయి. కాలు నేల మీద రాసి ముందుకు పోతున్నాడు. కాలువేస్తే నేల కాలిపోతూవుంది. బొబ్బ లెక్కినట్లు గూగడికి తెలియదు. ఒక్కొక కంపలో అడుగేసి, ఆగకుండా వెళుతున్నాడు.

సుడిగాలి తీవ్రత తగ్గింది. ఆకాశంలో గువ్వలు మాదిరిగా కనిపించే బట్టలు రాబందులు మాదిరిగా దిగివస్తున్నాయి రేగడినేల నలుపు సాంద్రత మాయమవుతూ, పోతున్నకొద్దీ గరుపు నేల ఎరుపు సాంద్రత పెరుగుతూ వుంది. రోడ్డు కవతల ఎర్రని గరువు! బట్టలు రోడ్డు రెండు ప్రక్కలాఉన్న చింతచెట్టు చిటారుకొమ్మలమీద పడిపోతే బాగుండుననుకొన్నాడు.

రోడ్డు దాటాడు. పంచెలు క్రిందికి రాలేదు. ఎర్రదుమ్ము, మరీ దువ్వ పేనంలో వేయించినట్లుంది. రెండు పంచెలూ దిగుముఖం పట్టాయి. రెంటికీ మైత్రీ చెడింది. వేరై పోయాయి. చిన్నపంచె ముందుగా పడిపోయే టట్లుంది.

ఎదురుగా చేను చుట్టూ అలవగా పెరిగిన చిల్లకంపకంచె బేకంటి మనిషి చేయి ఎత్తు పెరిగింది. ఆపైన తాటితోపు, ఏనాటి చెట్లో ఆకాశంలోకి పెరిగి పోయాయి. ముందున్న చిల్లకంపనూ, పైనుంచి పడుతున్న పై పంచెనూ, జాగ్రత్తగా చూస్తూ పరుగెత్తుతున్నాడు పొట్టికాళ్ళ పొట్టిమనిషి గూగడు. కంచెమీద పంచెపడకుండావుంటే బాగుండునని అనుకొంటున్నాడు. కంచె మీద పడితే తీసుకోవటం తనకు కష్టం! చిరుగుతుంది!

పంచె ఉన్నటుండి సయ్యిన జారింది. కంచె కివతల పడుతుందని పించింది. కంచె ఎదుట వికృతంగా నిలిచింది. పంచె సుకృతంగా దిగింది. గజం దూరంలో కంచె! గజం ఎత్తులో పంచె! కంచెమీద పంచె పడకూడదు. కాళ్ళూ, చేతులూ ఎత్తినా అందటంలేదు. అడుగు ముందుకువేశాడు. కంచె! అడుగు క్రిందికి జారింది పంచె! గూగడు ఎగిరాడు రెండు చేతులతో పొదివి పంచెను పట్టుకొన్నాడు. కాలునేలమీద ఆనలేదు. తూలిపోయాడు. నిట్టనిలువునా కంచెలో పడ్డాడు. చేతులు పంచెను వదలలేదు. ఒక కాలు చిల్లకంప ముళ్ళు చీరుతూ, నేలమీద పెట్టుకొన్నాడు. రెండో కాలు చిల్లకంప

వెన్నుమీద తన్నిపట్టి లాక్కున్నాడు. తొడల్లోదిగిన ముళ్ళు, విరిగినవి విరిగి లోపలే ఉండిపోగా, ఊడివచ్చిన కన్నాలలోంచి, ముసలి నెత్తురు చెదురు చెదురుగా వెలుపలికివచ్చి, కట్టు పంచెకు గోరంత పులిమి ఇంక ఓపికలేక బైటికి రాలేక, వచ్చేందుకు లేక ఆగిపోయింది.

కట్టుపంచె, పట్టుపంచె, అల్లంతదూరంలోపడే వాటంలో ఉంది. పై పంచె గబగబా మడతపెట్టి, చంకలో పెట్టుకొని, వస్తూ పోతూ పశువులు కంచెలో చేసిన కంతలోంచి దూరి, చేనులోకిపోయి, ఎండిపోయిన కంది మోళ్ళు కాలిబొటన వ్రేళ్ళ పుళ్లను కెలుకుతూవుంటే, చేనుకు అడ్డంపడి పరుగెత్తి అవతలకు చేదుకొన్నాడు! ఎదుట తాటితోపు!

కట్టుపంచె కిందికి దిగుతూ వుంది. తాటిచెట్లుమీద పడుతుందనిపించింది. గ్రద్ద, కోడిపిల్లను సుతారంగా తన్నుకుపోయినట్లు, పసిపిల్లాడి చేతిలో తాయిలం కాకీ తన్నుకుపోయినట్లు, కట్టుపంచే, ఒక తాటి చెట్టు మాడుమీద అంటీ అంటకుండా తన్ని, రెండో చెట్టుమీద కొరిగి, ఆకులన్నింటిమీదికీ కప్పేసి నట్లు జారి, ముండమోపికి ముసుగువేసినట్లు ఆ ఆడతాడి తలమీద ముసుగువేసినట్లు పడింది-పాలరంగు పట్టుపంచే!

గూగడు క్రిందనుంచి పైదాకా చెట్టును పరిశీలనగా చూశాడు. ఆరేడు నిలువులెత్తుంది. చెట్టు గెలలతో విరగబడుతూవుంది. ఆ తాడికి కల్లు గీయలేదు. కల్లుముంత, చుట్టూ ఆడతాడిచెట్టుకున్నట్లు ఆ చెట్టుకు లేదు. ముంజెలుకోసం ఉంచి ఉన్నట్లున్నాడు మోతాదు. చెట్లు చూస్తుంటేనే కాళ్ళు వణుకుతున్నాయి.

మునుపు వయస్సులో ఉన్న కాలంలో ఎంత పరుగెత్తేవాడయినా, "ఆనాటి" తోపులోంచి, ఊళ్లోకి పోయి, వేణుగోపాలస్వామి దేవాలయంలో దణ్ణం పెట్టి తిరిగివచ్చేసరికి, పది తాడిచెట్లు ఎక్కి, ఒక్కొక్క చెట్టునా నాలుగు గెలలు కొట్టి, ధీమాగా నిలబడేవాడు గూగడు. అటువంటివాడిప్పుడు ఆ చెట్టునూ చెట్టుమీద పంచెనూ చూచి వణికిపోతున్నాడు. చివరిసారి గూగడు తాటి చెట్టెక్కి, పాతికేళ్ళయినా అయివుంటుంది.

సుడిగాలి తగ్గింది. పడమటి శాంబరం ఆ గూబలో దూరి ఈ గూబ

లోంచి పోతూ వుంది. చంకలో పట్టుపైపంచె తీసి ఎండు తాటాకు మీద పెట్టి, నున్నటిరాయి, దుమ్ముపోయేట్టు చొక్కాకు తుడుచుకొని, పంచెమీద ఎత్తు పెట్టి, తాటిచెట్టు మొదట్లో నిలబడి, రెండు చేతులెత్తి దణ్ణం పెట్టి రెండు చేతులతో తల్లిని వాటేసుకొన్నట్లు చెట్టును వాటేసుకొని కాళ్లెత్తి చెట్టుకు మోటించి కుందుకూర్చున్నాడు. కాళ్ళకు బంధం వేసుకోలేదు. పైకి ప్రాకుతున్నాడు. ఎంత అలవాటు తప్పినా, ఎంత ముసలివాడయినా, ఎంతవోపిక లేకపోయినా, ఎదురొమ్ము తాటికి మోటించకుండా కాళ్ళూచేతులతో పైకి ప్రాకుతున్నాడు. చితికిన బొటనవ్రేళ్ళు, కోసుకుపోయి, ముళ్ళుదిగి, బొబ్బలెక్కి పచ్చిపుళ్ళలాగా వున్న అరికాళ్ళు, గుండు సూదులు మాదిరిగా పైకి పొడుచుకొని నిటారుగా ఉన్న తాటి మట్టల పాదుల ఈనెలు మీదపడి గుచ్చుకొని, పుళ్లుచితికి బొబ్బలు పగిలి, కాకి పొడిచే ఎద్దుపుండులాగా అయిపోతున్నాయి. కలుక్కు కలుక్కు మంటూ, జివ్వు జివ్వు మంటూ ఎక్కడెక్కడో పదునైన సన్నటి మేకులు గుచ్చుకొంటున్నట్లు అరికాళ్లు, వ్రేళ్లు, గోళ్లు మాత్రమే కాదు పులి వెంట్రుక పాదులో - ఒళ్లంతా ఎద్దులు తొక్కేసిన బురద కుంట మాదిరిగా వుంది.

పైకెక్కి తాటిగెలలు దగ్గర చెట్టుకు కాళ్ళు బంధం వేసినప్పుడు చెట్టుచుట్టూవున్న గరుకు గుచ్చుకుపోయి తొడలు, ముళ్ళుదిగి, నెత్తురు చిమ్మి, తిమ్మిరెక్కి మొద్దుబారి ఉన్న పుండుమీద కారం చల్లినట్లు అయిపోయాయి.

లాభం లేదనుకొని, తాటిగెల మీద పచ్చి మట్ట కుదుట్లో పట్టుకొని, గెలమీద కాలేసి, పైకిలేచి, మొవ్వలోకి పోయి కూర్చున్నాడు. కాళ్లూ చేతులూ గజగజ వణకుతున్నాయి. గూని పై మట్టల గరికి తగిలి గీరుకు పోతూ వుంది. 'ఎవడ్రాడు ఎవుడ్రా తాడెక్కినోడు!' అని అరుచుకొంటూ దుడ్డుగఱ్ఱవూపుకొంటూ వచ్చాడు తోపుకాపలా మోతాదు. 'నేనే! నేనే రా మోతాదు, నేనే గూగణ్ణి" అన్నాననుకొన్నాడు. అన్నట్లేలెక్క! అయితే మోతాదుకు వినిపించలేదు. దుడ్డుగఱ్ఱ పైకి విసరటానికి ఉటంకిస్తూ 'పలక వెవుడువు రా నువ్వూ? నెఁవర గంత బగలగొట్టేవోడు లేక! కింద కొత్తవా దుడ్డుగఱ్ఱిసర మంటావా యేంది జెప్పో!'

నాలుక ఎండిపోయిందనీ, మాటరావటం లేదనీ, దప్పిక అవుతూ వుందనీ, గూగడు గుర్తించాడు. గవదలు నొక్కిపట్టి, నాలుక కొద్దిగా తడి చేసుకొని, "నేనే రా, నేనే గూగణ్ణి!" అంటూ క్రిందికి చూశాడు. కళ్ళు బైర్లు గ్రమ్మాయి. గిర్రున తిరిగాయి. కాళ్ళు వణికాయి. 'తల్లీ!' అంటూ మొవ్వను వాటేసుకొన్నాడు.

'యేంది? యేంది మావా? నువ్వా? యెంమకెక్కా? నువ్వెందుకెక్కావంటసలు? ముంజెలు గావలిత్తే నన్నడిగితే బోలా! పంపిచ్చేవోణ్ణిగా! అదేంది పైనపంచే?' మోతాదు గ్రుడ్లప్పగించి చూస్తూ వుండిపోయాడు. దుడ్డు గర్ర చేతిలోంచి జారి క్రింద పడింది.

గూగడు మొవ్వలో కూర్చునే పంచెను అందుకోబోయాడు. అక్కణ్ణుంచి నిలువెత్తున తాటిమట్టపైన ఆకుల కొనల చివర్లలో ఆరేసినట్టువున్న కట్టుపంచె, రత్తయ్య పట్టు కట్టుపంచె, పెళ్ళినాటి రత్తయ్య పట్టు కట్టుపంచె, చేతికి అందలేదు.

గూగడు నిలబడి, తాటి మొవ్వాకు ఒకచేతి గుప్పెట్లో పట్టుకొని రెండో చేయి పంచెకోసం చాచి, అందక, మొవ్వలోంచి కాలుతీసి, పై బట్ట మీద పెట్టి, ఎక్కి అందుకోబోతుంటే, కాలుపెట్టిన మట్ట ఒంగుతూ, అందబోతున్నప్పుడు తాటి మట్ట గరిమీద కాలు కస్సున జారిపోయింది. రంపంతో కోసినట్లయి, అరికాలు అంగుళం లోతుకు తెగింది. పడబోయి 'దేవుడా' అని మొవ్వాకు వాటేసుకొన్నాడు. గూని రెండో గరిమట్టను మోటుకొంది. కాలు జారిన మట్ట గరివెంట కారిన నెత్తురు, కుదుట్లోకి పోయి, అక్కణ్ణుంచి తాటి చెట్టు బారున పాములాగా సర్రున దిగిపోయి, మధ్యలో ఆగిపోయింది.

గూగడు, మళ్ళీ పై మట్టమీద, గరికిలేని చోట కాలుబెట్టి, పైకినిక్కి, పట్టుపంచెకొాన అందిపుచ్చుకొని, పసిపాప పెదివి మీది నీరు తుడిచినట్లు, కంట్లో నలక తీసినట్లు, మెల్లగా లాగి, పట్టుపంచె గుండెలకు ఆనించుకొని, క్షణకాలం తృప్తిగా కళ్లు మూసుకొని, నెమ్మదిగా మొవ్వవదిలి, గెలలమీదగా దిగి, చెట్టు బారున క్రిందికి వచ్చాడు.

దిగీ దిగటంతోనే మోతాదు ముఖంలోకి చూచి, "నీళ్లు- మంచీళ్లు!" అని గొణిగాడు గూగడు. మోతాదుకు అర్థమయి, అర్థంకాక, వినిపించి, వినిపించక, అయోమయంగా చూశాడు. కట్టు పంచె మడతపెట్టి, ఎండు తాటాకు మీద ఉన్న పైపంచె తీసుకునేందుకు వంగి, తూలి పడిపోయాడు. నాలుక తడి ఆరిపోయింది. మోతాదు చూశాడు. అర్థంచేసుకొన్నాడు. కంగారుగా అటూ ఇటూ పరుగెత్తబోయి ఆగాడు.

మూడు చిలకొట్టిన తాటి కాయలు, రాత్రెప్పుడో ఉడుతలు తిని పడేసినవి, రెండు తాటిచెట్ల మొదళ్ళలో కనిపించాయి. ప్రతికాయకు ఉడత తినగా మిగిలిన రెండు కళ్లు వున్నాయి. గబగబా చిలక్కొట్టిన కాయల ముచ్చికలు తీసి, పెచ్చులు నోటితో పీకి, కళ్ళు కనిపించేట్టు చేసి, ఆరు ముంజెల కళ్లు పొడిచి, ముంజె నీళ్లు గొంతులో పోసి, నోరు తడిపి, లేత ముంజె పొక్కులు తీసి, చిన్ని చిన్ని ముక్కలుచేసి, నోట్లో వేస్తే నీరు నింపిన దూదిలాగా గొంతులోకి చేరుకొన్నాయి. గూగడు గుటక వేశాడు.

మోతాదు సహాయంతో చెరువు గట్టుకు వచ్చి, అక్కడ పడివున్న బట్ట పేలికలు తడిపి కాళ్ళకు కట్టుకొని, కడుపునిండా నీళ్లుతాగి, సుబ్బారావు కాపలా వున్న బట్టల మూటలో పట్టు బట్టలు పెట్టుకొని, ఊరి ముఖం పట్టాడు గూగడు. వెనుకా ముందూ మోతాదూ సుబ్బారావూ ఉన్నారు. డొంకలో నడుస్తున్నారు.

ఈ గూగడు ఉదయం చెరువు గట్టు మీదికి వచ్చిన మనిషి కాదు. వేరే మనిషి. క్రొత్త మనిషి! ఇతని శరీరం ఉదయిం ఉన్నది కాదు. వేరే శరీరం. క్రొత్త శరీరం! ఇన్ని ఏళ్ళుగా ఉన్న మనస్సు, ఆత్మ కావివి. వేరేవి. క్రొత్త మనస్సు! క్రొత్త ఆత్మ!

క్రొత్త శరీరంతో, క్రొత్త ఆత్మతో, క్రొత్త మనస్సుతో ఈ క్రొత్త మనిషి గూగడు, పాత వాతావరణంలోకి, పాత ఊరులోకి, పాత యింటిలోకి, పాత కుక్కి నులక మంచంలోకీ వచ్చాడు. ❊

ఆంధ్ర పత్రిక- సౌమ్య సంవత్సరాది సంచిక (1969-70)